రోడ్ షోకు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

సుంకిని నుంచి రోడ్‌షోకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కోటగిరి, మే 7 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కామారెడ్డిలో మంగళవారం నిర్వహించిన రోడ్ షోకు ఉమ్మడి కోటగిరి మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

నేడు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

వినాయక్‌నగర్, మే 7 : జిల్లాకేంద్రంలో నేడు (బుధవారం) సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో, కార్నర్ మీటింగ్ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని సీపీ కల్మేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూలాంగ్ చౌరస్తా నుంచి నగరంలోకి వచ్చే వాహనాదారులు న్యాల్‌కల్ చౌరస్తా, వర్ని రోడ్, బోధన్ బస్టాండ్ నుంచి గాంధీ చౌక్‌కు చేరుకోవాలని పేర్కొన్నారు. బోధన్ వైపు నుంచి వచ్చిపోయే వాహనాలు అర్సపల్లి రైల్వే గేట్, కొత్త కలెక్టరేట్ ఖానాపూర్ ఎక్స్‌రోడ్డు, దుబ్బ చౌరస్తా, శివాజీచౌక్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా, కంఠేశ్వర్ వైపు నుంచి వచ్చే వాహనాలు ధర్నా చౌక్ 'టీ' జంక్షన్, రైల్వేస్టేషన్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నంపచి ఆర్టీసి బస్టాండ్‌కు వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ వైపు నుంచి, ఆర్మూర్ నుంచి వచ్చే, పోయే వాహనాలు కంఠేశ్వర్ బైపాస్ నుంచి కొత్త కలెక్టరేట్, దుబ్బ మీదుగా, బాన్సువాడ వైపు నుంచి వచ్చి పోయే వాహనాలు వర్ని రోడ్డు చౌరస్తా, ఖిల్లా చౌరస్తా, బోధన్ బస్టాండ్, అర్సపల్లి రైల్వే గేటు మీదుగా కలెక్టరేట్, దుబ్బ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుందని వివరించారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలి

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య

బోధన్, మే 7: వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తలు తీసుకోవాలని బోధన్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆర్టీసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బస్సు డ్రైవర్లతోపాటు కండక్టర్లు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని, ఎండ తీవ్రతను తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ద్రవ పదార్థాలను తీసుకోవాలని, నీటిని ఎక్కువగా తాగాలని సూచించారు. ఆర్టీసీ డిపోలో ఓఆర్ఎస్ పాకెట్లను డీఎం శ్రీనివాస్, సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

సేవాతత్వాన్ని అలవర్చుకోవాలి

మోర్తాడ్, మే7: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని శెట్‌పల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు పెగడము త్తెన్న అన్నారు. శెట్‌పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన కరుణట్రస్ట్ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. అనంతరం కార్యక్రమానికి వచ్చిన వారికి బుద్ధుని జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజగంగారాం, నరేందర్, ట్రాన్స్‌కో ఉద్యోగి రాజేందర్, ట్రస్ట్‌చైర్మన్ మహేశ్ కుమార్, సభ్యులు నర్సయ్య, చిరంజీవి, సతీశ్ పాల్గొన్నారు.

ధ్యాన మందిర నిర్మాణానికి భూమిపూజ

నవీపేట, మే 7: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో విరాళంగా ఇచ్చిన భూమిలో మంగళవారం పిరమిడ్ ధ్యాన మందిర నిర్మాణానికి పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణరెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పిరమిడ్ స్పిరిటికల్ సొసైటీ మూమెంట్(పీఎస్ఎస్ఎం) వ్యవస్థాపకుడు జగద్గురువు బ్రహ్మర్షి పితామహ సుభాష్ పత్రీజీ ఆశయ సాధనలో భాగంగా ప్రజలందరూ ధ్యానం చేసి శాఖాహారం భుజించాలనే సంకల్పంతో నారాయణపూర్ గ్రామంలో పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థల దాత బినోలా సొసైటీ మాజీ చైర్మన్ కిశోర్‌రావు, గ్రామ పెద్దలు ఇందిరా భాస్కర్‌రావు, సఖాల లక్ష్మణ్‌రావు, బొడ్డు దయానంద్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలి

రెంజల్, మే 7: పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ జీపీ కార్యదర్శులకు సూచించారు. మండలంలోని సాటాపూర్ గ్రామ పంచాయతీలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించనున్న పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు, సరిపడా గదులను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీవో గౌసొద్దీన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు రోడ్డుపై కూలిన చెట్టు

ఆర్మూర్‌టౌన్, మే7: ఆలూర్ మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వీచిన గాలిదుమారానికి చెట్లు విరిగాయి. రాంపూర్ వెళ్లే రోడ్డుపై చెట్టు నేలకొరిగింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

బాధితురాలికి ఫోన్ అప్పగింత

ముప్కాల్, మే7: మెండోరా మండలంలోని బుస్సాపూర్ గ్రామానికి చెందిన కొలిప్యాక్ సౌందర్య ఆదివారం ఆర్టీసీ బస్సులో ఆర్మూర్ నుంచి బుస్సాపూర్ గ్రామానికి వచ్చే క్రమంలో తన మెబైల్‌ను పోగొట్టుకుంది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఆర్ పోర్టల్ ద్వారా ఒక్క రోజులోనే వెతికి బాధితురాలికి సోమవారం అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ రమేశ్ తెలిపారు.

నేడు పుస్తకావిష్కరణ

సుభాష్‌నగర్, మే 7 : సంస్కార భారతి ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఇందూరు కవులు రాసిన అయోధ్య వైభవం పుస్తకాన్ని నేడు (బుధవారం) సాయంత్రం హరిచరణ్ మర్వాడీ పాఠశాల ప్రాంగణంలో ఆవిష్కరించనున్నట్లు అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రధానవక్తగా ఇందూరు ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రతినిధి కృష్ణశాస్త్రి హాజరుకానున్నట్లు తెలిపారు. భాషాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తల్లి లేదనే బెంగతో.. కూతురు మృతి
ఒకేసారి ఇద్దరి అంత్యక్రియలు.. బోర్లంలో విషాదం

బాన్సువాడ రూరల్, మే 7: తన తల్లి ఇక లేదనే బెంగతో కూతురు మృతి చెందిన ఘటన బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. కాటేపల్లి చోటీబీ (75) కొంతకాలంగా పెద్ద కూతురు రజియాబీ (60)తో కలిసి బాన్సువాడలో చిన్నకూతురు వద్ద ఉంటున్నది. అనారోగ్యంతో తల్లి సోమవారం అర్ధరాత్రి మరణించింది. దీంతో పెద్ద కూతురు రజియాబీ బోరున విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. ఆమెకు ప్రథమ చికిత్స చేయించిన అనంతరం తల్లి అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తుండగా, మరోసారి అస్వస్థతకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. దీంతో ఇద్దరి అంత్యక్రియలనూ ఒకేసారి నిర్వహించారు. గంటల వ్యవధిలో తల్లీకూతురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కేసీఆర్‌కు జన నీరాజనం

డిచ్‌పల్లిలో మంగళహారతులు, పూలతో ఆహ్వానించిన మహిళలు

ప్రచార వాహనానికి స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు

కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు పూలతో సిద్ధంగా ఉన్న మహిళలు

డిచ్‌పల్లి, మే 7 : జిల్లాకేంద్రంలో రోడ్‌షో ముగించుకొని, మంగళవారం కామారెడ్డి జిల్లాకు వెళ్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు డిచ్‌పల్లి నాగ్‌పూర్ గేటు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కేసీఆర్ డిచ్‌పల్లికి వస్తున్నారన్న విషయం తెలుసుకొని, మండలకేంద్రంతోపాటు ఘన్‌పూర్ చుట్టుపక్కల గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో నాగ్‌పూర్ గేటు వద్దకు చేరుకున్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, కేసీఆర్ ప్రచార రథంపై పూలవర్షం కురిపించారు. కేసీఆర్ డిచ్‌పల్లికి చేరుకోగానే నాయకులు పటాకులు కాల్చి అభిమానం చాటుకున్నారు.

బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని నినాదాలు చేశారు. ప్రచార రథం నుంచి కేసీఆర్ ప్రజలకు అభివాదం చేశారు. కేసీఆర్ వెంట బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభసభ్యుడు కేఆర్.సురేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ వీ గంగాధర్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, జీవన్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాంబారి మోహన్, సీనియర్ నాయకులు శక్కరికొండ కృష్ణ, దాసరి లక్ష్మీనర్సయ్య, నల్లవెల్లి సాయిలు, పద్మారావు, ఒడ్డెం నర్సయ్య, జాకీర్, అంజయ్య, నడ్పన్న ఉన్నారు.





బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో బిగాల గణేశ్ గుప్తా కుటుంబీకులు, ధర్పల్లి ఎంపీపీ నల్ల సారిక దంపతులు

కేసీఆర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు

ఖిలీల్‌వాడి/ ధర్పల్లి, మే 7 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి కేసీఆర్ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసంలో బసచేశారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేసీఆర్‌ను జిల్లాకేంద్రంతోపాటు వివిధ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. బిగాల గణేశ్ గుప్తాతోపాటు అతడి సోదరు బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ కో-ఆర్డినేటర్ మహేశ్ బిగాల, కుటుంబీకులు కేసీఆర్‌ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. అనంతరం కేసీఆర్ కామారెడ్డిలో రోడ్‌షో నిర్వహించేందుకు బయల్దేరారు. ధర్పల్లి ఎంపీపీ నల్ల సారిక హన్మంత్‌రెడ్డి దంపతులు కేసీఆర్‌ను కలిశారు.

కాంగ్రెస్.. అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నది

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్, పక్కన బిగాల గణేశ్ గుప్తా

ఖిలీల్‌వాడి, మే 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని విజయలక్ష్మి గార్డెన్‌లో మంగళవారం రాత్రి పద్మశాలీ కులస్తుల ఆత్మీయ సమ్మేళనాన్ని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బాజిరెడ్డితోపాటు ఎమ్మెల్సీ ఎల్‌వీ రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కరెంట్ కోతలు ప్రారంభమయ్యాయన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు ఇప్పటికీ ఎవరికీ ఇవ్వలేదని అన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క పథకం కూడా అమలుచేయడం లేదన్నారు. ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డు తెస్తానని చెప్పి బాండ్ పేపర్ రాసిచ్చి గెలిచాడని, ఐదేండ్లు కాలయాపన చేసి, మళ్లీ పసుపు బోర్డు గురించి మాట్లాడుతున్నాడని అన్నారు.

బాజిరెడ్డిని మళ్లీ గెలిపించుకునే అవకాశం వచ్చింది..

బాజిరెడ్డిని గెలిపించుకునే అవకాశం మళ్లీ వచ్చిందని, కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డిని ఎంపీ చేయాలని అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా కోరారు. పద్మశాలీలకు కేసీఆర్ పెద్దపీట వేశారని, ఆయన హయాంలో జిల్లాలోని పద్మశాలీ సంఘాలకు రూ. 8 కోట్లు ఇచ్చినట్లు బిగాల తెలిపారు. బీడీ పెన్షన్లు, బతుకమ్మ చీరలతో కేసీఆర్ ఉపాధి కల్పించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. తెలంగాణను నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ దండు నీతూ కిరణ్, పద్మశాలీ సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనర్సయ్య, ఎనుగందుల మురళి, సత్యపాల్, పులగం హన్మాండ్లు, మహేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్, మే 7: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున మండల కేంద్రంలో మంగళవారం రాత్రి నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ప్రారంభించి కేసీఆర్ ప్రభుత్వం పేదలను ఆదుకున్నదని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ నాలుగు నెలల్లోనే రాష్ట్రంలో సమస్యలు ప్రారంభమయ్యారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఇంత వరకు అమలు చేయడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను వేల్పూర్ గ్రామస్తులు కడుపులో పెట్టుకుని కాపాడారని ఎమ్మెల్యే అన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఎంపీపీ భీమా జమున, ఎంపీటీసీ మొండి మహేశ్, సామ మహిపాల్, అజీజ్, రేగుళ్ల రాములు పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రజలు

బాజిరెడ్డికి మద్దతుగా విస్తృత ప్రచారం

సారంగాపూర్‌లో బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పిప్రి గ్రామంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సారంగాపూర్/ ధర్పల్లి/ఆర్మూర్‌టౌన్/మోర్తాడ్, మే 7: బీఆర్ఎస్ నిజామాబాద్ లోకసభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరుగుతూ, కరపత్రాలు పంచుతూ ప్రచారం చేపట్టారు. రూరల్ మండలంలోని సారంగాపూర్‌తో పాటు వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అమలుచేసిన సంక్షేమ పథకాలపై వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి, బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎండీ. అక్బర్ నవాజుద్దీన్ ఆధ్వర్యంలో పది రోజులుగా ప్రచారం కొనసాగుతున్నది.

ధర్పల్లి మండలకేంద్రంలో ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం చేశారు. రూరల్ నియోజకవర్గంలో బాజిరెడ్డి చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామంలోని పలు కాలనీలు, ఉపాధి హామీ పనుల ప్రదేశంలో మంగళవారం ఆయన ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలు ఇప్పటికీ అమలు చేయకుండా మరోసారి ప్రజలను మోసం చేసే ఆలోచనలో ఉన్నదని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మవద్దని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పదేండ్లలో తెలంగాణను అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలిపారని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆర్మూర్ పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ చక్రు స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గత సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎంపీగా బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లోని గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ ప్రతి దుకాణాలకు తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఇచ్చిన హామీలకు సంబంధించి వీడియోలను చూపిస్తూ ప్రచారాన్ని నిర్వహించారు.

ఆర్మూర్ పట్టణంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ కౌన్సిలర్ చక్రు

తిమ్మాపూర్‌లో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు..

నేడు బాజిరెడ్డి, వేముల ప్రచారం

ఏర్గట్ల, మే 7: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రానికి బుధవారం ఉదయం 8గంటలకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రానున్నారని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని కోరారు.

పలు కళాశాలల్లో తనిఖీలు

డిచ్‌పల్లి, మే 7 : జిల్లాలోని పలు డిగ్రీ కళాశాలల్లో అధికారులు, ప్రొఫెసర్లు మంగళవారం తనిఖీలు చేపట్టారు. కళాశాలల్లోని వివిధ విభాగాలు, గదులను పరిశీలించారు. 2024-25 విద్యా వార్షిక అనుబంధ గుర్తింపు తనిఖీల్లో భాగంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేపట్టిన వారిలో అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతీఖ్ సుల్తాన్ ఘోరీ, వివిధ ఫ్యాకల్టీ డీన్స్ ఆరతి, లావణ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం పరిశీలన

డిచ్‌పల్లి, మే 7 : మండలంలోని మిట్టాపల్లి జడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో జిల్లా యూత్, స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని జిల్లా యూత్, స్పోర్ట్స్ ఆఫీసర్ ముత్తన్న మంగళవారం పరిశీలించారు. క్రీడాకారులకు సాఫ్ట్‌బాల్ పరికరాలను అందజేసి మాట్లాడారు. ఉదయం, సాయంత్రం నిర్వహించే శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ కబడ్డీ కోచ్ ప్రశాంత్, సురేశ్, శిక్షణ శిబిరం కోచ్ మార్కంటి గంగామోహన్, జిల్లా కోచ్ అనికేత్, సీనియర్ క్రీడాకారులు సెంథిల్, అంజలి, గంగాధర్, వినయ్, సాయిలు పాల్గొన్నారు.

ఆరోగ్య విస్తరణాధికారికి ఉగాది పురస్కారం

ఇందల్వాయి, మే 7 : మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో ఆరోగ్య విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఎనుగందుల శంకర్‌కు స్వర్ణ లక్ష్మణ్‌రావు స్మారక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని విశ్వోదయ టెక్నో స్కూల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక మండలి పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాశేశ్వరం శంకరయ్య చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో బైస దేవదాసు, దారం గంగాధర్, కాసర్ల నరేశ్ రావు, సిద్ధిపేట వెంకటేశ్వర్లు, వీపీ చందన్‌రావు పాల్గొన్నారు.

శారదా పీఠాధిపతిని కలిసిన లక్ష్మీగణపతి ఆలయ కమిటీ ప్రతినిధులు



విదుశేఖర భారతీస్వామిని దర్శించుకుంటున్న లక్ష్మీగణపతి ఆలయ ప్రతినిధులు

సుభాష్‌నగర్, మే 7 : జిల్లాకేంద్రంలోని బోర్గాం (పీ) వద్ద ఉన్న లక్ష్మీగణపతి మహా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, వేదపండితుడు అరుణ్‌కుమార్ శర్మ బృందం కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరి శారదా పీఠంలో భారతీ తీర్థ మహాస్వామితోపాటు విదుశేఖర్ భారతీస్వామిని మంగళవారం కలిశారు. జిల్లాకేంద్రంలో ఆగస్టులో లక్ష శ్రీసూక్త పారాయణ తర్పణ యజ్ఞం గురించి మహాస్వామికి వివరించి, అనుమతి తీసుకున్నారు. మూడు రోజుల పాటు మహాయజ్ఞ క్రతువు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

భర్త మందలించాడని వివాహిత ఆత్మహత్య

రెంజల్, మే 7: మండల కేంద్రంలోని లావణ్య (36) అనే వివాహిత చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాయన్న మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. ఉదయం త్వరగా లేవడంలేదని ఆమె భర్త సాయిలు మందలించడంతో ఇంటి నుంచి లావణ్య బయటికి వెళ్లింది. గ్రామశివారులోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి మొగులవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మృతదేహానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం కోసం బోధన్ దవాఖానకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది..

నవీపేట, మే 7: మండలంలోని జన్నేపల్లి వాగులో దూకి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. మాక్లూర్ మండలం కొత్తపల్లికి చెందిన జెట్టవాని అబ్బాయి(62) కొన్నేండ్లుగా మతిస్థిమితం లేక అనారోగ్యంతో బాధ పడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఈనెల 6 ఇంటి నుంచి బయల్దేరి మండలంలోని జన్నేపల్లి వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గడ్డి వాము దగ్ధం

ఆర్మూర్‌టౌన్,మే7:ఆలూర్ మండలంలోని మిడదపల్లిలో గడ్డివాము మంగళవారం దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం